దుర్గా వైభవం

ప్రవచనం

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

ఎమెస్కో

దుర్గా వైభవం

ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాసంలో వచ్చే శుక్ల పక్ష పాడ్యమి నుండి తొమ్మిది రోజులు చేసే ఉపాసనా కార్యక్రమానికి శారదా నవరాత్రులు అని ఋషులు పేరు పెట్టారు. ఈ నవరాత్రులు ఉపాసనాక్రమంలో అత్యంత ప్రధాన స్థానం వహిస్తాయి. మనం తరచుగా ఉపాసన అన్న మాటని వాడుతుంటాం. ఉపాసన అంటే దగ్గరగా కూర్చొనుట. ఎవరికి దగ్గరగా? అంటే తత్ పదార్థానికి దగ్గరగా ఉండుట. పరమేశ్వరుని దగ్గరకు చేరడానికి చేసే సాధనా క్రమానికి ఉపాసన అని పేరు.

ఆ క్రమంలో ఆశ్వయుజ మాసంలో వచ్చే మొదటి తొమ్మిది రోజులు చేసే ఉపాసన అత్యంత ప్రధానమైన ఉపాసన. మనకి 27 నక్షత్రాలు ఉన్నాయి. మొదటి అశ్వనీ నక్షత్రానికి అధిదేవతలు అశ్వనీ దేవతలు. చంద్రుడు అశ్వనీ నక్షత్రంతో కూడి ఉన్నప్పుడు వచ్చిన పౌర్ణమి కలిగిన మాసం కనుక ఆశ్వయుజమాసం మొదటి మాసం కావాలి. చాంద్రమాన ప్రకారం చైత్రమాసం మొదటి మాసం. 27 నక్షత్రాలలో మొదటి 13, వెనక 13 నక్షత్రాలను విడిచి పెట్టి మధ్యలో ఉన్న 14వ నక్షత్రమైన చిత్తా నక్షత్రంతో చంద్రుడు కూడుకున్న పౌర్ణమి ఉన్న మాసం కనక చైత్ర మాసం మొదటి మాసం అవుతుంది. ఉపాసనకు సంబంధించి ఆశ్వయుజ మాసం మొదటి మాసం అవుతుంది. భగవంతుణ్ణి చేరుకోవడానికి ప్రారంభం అక్కడ ఉంటుంది. ఆ మాసానికి అంత గొప్పతనం ఇచ్చి శారదా నవరాత్రులు అన్న పేరుతో తొమ్మిది రాత్రులు ఉపాసన చేస్తారు. దానికి ఒక్కటే ప్రధానమైన కారణం. ఈ మాసంలో మొదటగా ప్రారంభమయ్యే మొదటి తొమ్మిది రాత్రులు ఒక రోజుకి ప్రారంభంలో ఉండే తెల్లవారుజాము సమయం వంటివి. సూర్యోదయానికి 48 నిమిషాలకి ముందు ఉండే కాలాన్ని బ్రాహ్మీముహూర్త కాలం అంటారు. ఇది ఉపాసనకి పరమయోగ్యమైన కాలంగా నిర్ణయింపబడింది. ఉపాసనా క్రమంలో

ఉండే సంవత్సరమంతటినీ ఒక రోజుగా భావన చేస్తే తెల్లవారుజాము కాలం ఆశ్వయుజ మాసం వచ్చే పాడ్యమి నుండి నవమి వరకు ఉండే కాలం. ఆ తొమ్మిది రాత్రులను తెల్లవారుజాము కాలంగా పరిగణిస్తారు. ఒక సంవత్సరమంతటికీ శారదా నవరాత్రులే తెల్లవారుజాము కాలం. రోజు మొత్తానికి ఉపాసనకు అత్యంత యోగ్యమైన కాలం తెల్లవారుజామున సూర్యోదయానికి 48 నిమిషాలకి ముందు ఉండే కాలం. దానికి ఒక ప్రత్యేకమైన శక్తి ఉంటుంది కనుక దానిని ఉపాసనకు యోగ్యమంటారు.

మిగిలిన కాలం ఇంద్రియాలతో కలసి పైకి తిరిగే మనసు వశమవడం అంత తేలికయినది కాదు. తెల్లవారుజాముకాలంలో మనసు వెనకకి వెళ్ళి దాని మూలమైన ఆత్మ ఏది ఉన్నదో దానిలో ఒదిగిపోతుంది. ఒక రోజుకి తెల్లవారుజాము కాలం ఎంత గొప్పదో శారదా నవరాత్రుల కాలం అంత గొప్పది.

తొమ్మిది రోజుల క్రమాన్ని విడచి పెట్టకూడదు. అందరూ చేస్తారు. వ్యక్తిగతంగానూ చేస్తారు. దేవాలయాలలోనూ చేస్తారు, వీధి వీధిన దుర్గా అమ్మవారిని నిలబెట్టి వాయు ప్రతిష్ఠచేసి తొమ్మిది రోజులు అమ్మవారి ఉత్సవాలు చేసి పదవ రోజు విజయదశమి అన్న పేరుతో పండగ నిర్వహించి సాధారణంగా శాంతికర కల్యాణంతో పూర్తి చేసి అమ్మవారి మూర్తిని తీసుకుని వెళ్ళి నిమజ్జనం చేస్తుంటారు.

శారదానవరాత్రులు భారీ ఎత్తున ఎందుకు చేస్తారంటే దానికి ఒక ప్రధానమైన కారణం ఉన్నది. శరత్కాలం ప్రారంభమయినప్పుడు భాద్రపదమాసం కృష్ణపక్షంలో ఏకాదశి తిథి వెళ్ళిపోవడం ప్రారంభమయినప్పటినుండి ఆశ్వయుజమాస ప్రవేశమయినట్లు. కృష్ణపక్ష ఏకాదశి తరవాత మంచిపనులు చెయ్యడానికి అంగీకరించరు. భాద్రపద మాసం కృష్ణపక్ష పాడ్యమి నుంచి చెయ్యరు. పితృపక్షమైన తిథుల్లో శుభకార్యాలు చెయ్యరు. ప్రత్యేకించి ఆశ్వయుజ పాడ్యమి వచ్చేసరికి యమధర్మరాజుగారి ఒక కోర బయటికి రావడం ప్రారంభమవుతుంది. ఒక కోర ఆశ్వయుజమాస తిథి నుండి బయటికి వస్తే వేరొక కోర మళ్ళీ వసంత నవరాత్రులలో చైత్రమాసంలో వచ్చే శుక్లపక్ష పాడ్యమి

లగాయితూ బయటికి వస్తుంది. ఈ రెండు ఋతువులలో పాడ్యమి నుండి నవమి వరకు యమధర్మరాజుగారి కోరలు బయటికి వచ్చిన కారణం చేత ఈ ఋతువులో తొమ్మిది రాత్రులలో ఒక లక్షణం వుంటుంది. పరమ భయంకరమైన అంటువ్యాధులు ప్రబలుతాయి. శాస్త్రం అవి ఎంతో ప్రమాదమైనవని చెప్పింది. అది అంటుకున్న వ్యక్తి గ్రామానికి ఒకడు ఉన్నా ఊళ్ళోని వారందరూ ఇళ్ళు విడిచిపెట్టి పారిపోవలసినంత భయంకరమైన అంటువ్యాధులు ప్రబలే కాలం.

ద్వావృతూ యమదంష్ట్రాఖ్యే నూనంసర్వ జనేష్వైః వసంత శారదా రాత్రౌ

వసంత ఋతువులో, శరత్ ఋతువులో వచ్చే రెండు తొమ్మిది రాత్రులలో కూడా యముని కోర బయటికి వచ్చిన కారణం చేత అపార జననష్టం జరుగుతుందని శాస్త్రవాక్కు. శాస్త్రం ఏది చెప్పినా యథార్థమే చెపుతుంది. దీనిని పోగొట్టుకోవడానికి మార్గం ఎక్కడ ఉంటుందంటే ప్రకృతి స్వరూపమైన దుర్గాదేవి అమ్మవారిని తొమ్మిది రోజులపాటు పూజించి అమ్మవారి అనుగ్రహాన్ని పొందితే దేశమంతా సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉంటుంది. అంటువ్యాధుల బారిన పడి ఎన్నో వేలమంది పడిపోవలసిన అగత్యం ఏర్పడదని మనకు శాస్త్రం వివరిస్తుంది.

సర్వ జనులని పడగొట్టే భయంకరమైన యమదంష్ట్రలు రెండూ కూడా బయటికి వస్తాయి. అవి రాకుండా చెయ్యాలంటే ఉపాసనా మార్గంలో ఒకే ఒక్క ఆధారముంటుంది. అదే దుర్గాదేవి ఆరాధన. దుర్గ అని పేరు కలిగిన అమ్మవారి ఆరాధన ప్రకృతి అంతటికీ ఉపశాంతి కల్పిస్తుంది. జననష్టం జరగకుండా, చతుష్పాదులైన ప్రాణులకు నష్టం కలగకుండా లోకాన్ని సుభిక్షంగా ఉంచగలిగిన శక్తిని అనుగ్రహించగలిగిన పరదేవత స్వరూపం దుర్గమ్మ. అందువల్ల ఆమె ఆరాధన చేస్తారు.

భారతదేశమంతటా వాతావరణం ఒకలా ఉండదు. దక్షిణ భారతదేశంలో చలి ఒకలా ఉంటే ఉత్తర భారతదేశంలో చలి ఒళ్ళు కొయ్యబారిపోయేలా ఉంటుంది. విపరీతమైన వ్యత్యాసం ఉంటుంది. శరదృతువు ఆశ్వయుజమాస శుక్లపక్షంలో పాడ్యమి నుండి నవమి తిథి వరకు ప్రారంభకాలంలో మాత్రం భారతదేశమంతటా ఒకేలా ఉంటుంది. సర్వశుక్లా సరస్వతీ... తెల్లని కాంతి

కలిగిన లక్షణంతో సరస్వతీదేవి అనుగ్రహం ప్రస్ఫుటంగా ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ దేశంలో విశేషమైన పాండిత్యం కలిగిన వాళ్ళు ఒకప్పుడు కాశ్మీర దేశంలో పుట్టారు. అందువల్లనే సర్వజ్ఞపీఠం కాశ్మీర దేశంలో ఉండేది. ఇప్పటికీ పాక్ ఆక్రమిత కాశ్మీరంలో సర్వజ్ఞపీఠం, సరస్వతీ దేవాలయం ఉన్నాయని ప్రతీతి. అటువంటి ప్రాంతంలో పుట్టిన చాలామందిని కాశ్మీర పండితులు అనే పిలుస్తారు. అంత సరస్వతి అనుగ్రహం పొందిన కాశ్మీరు రాష్ట్రంలో సరస్వతీదేవి ఎంత తెల్లగా ఉంటుందని చెప్పబడినదో అంత తెల్లగా హిమవత్పర్వతమంతా మంచుతో కప్పబడి ఉంటుంది. కొద్ది వ్యత్యాసం తప్ప వాతావరణం ఒకేలా ఉంటుంది. దేశమంతా అమ్మవారి ఉపాసన తొమ్మిది రోజులు జరుగుతుంది.

విశేషమేమిటంటే తొమ్మిది రాత్రులు దుర్గనే ఉపాసన చేస్తారు. దుర్గని ఉపాసన చేసేటప్పుడు మొదటి మూడు రోజులు కాళీ స్వరూపంగా, మధ్యలోని మూడు రోజులు మహాలక్ష్మీ స్వరూపంగా, చివరి మూడు రోజులు సరస్వతీ స్వరూపంగా ఉపాసన చేస్తారు. అలా చేయడంలోని ఆంతర్యం మనుష్యుడు సహజంగా అనేకమైన వాసనలతో ఈ లోకంలోకి వస్తాడు. ఆ వాసనలను తొలగించగల శక్తి పేరు దుర్గ. సంప్రదాయజ్ఞులైన పెద్దలు 'దుర్గ' నామస్మరణ లేని రోజు ఉండకుండా చూసుకోవాలంటారు. ఒక్కసారి అయినా 'దుర్గాయై నమః' అనాలి లేదా కనీసం దుర్గా అని అయినా అనాలి. ఆంధ్రదేశంలో ఒకప్పుడు ప్రతి ఇంట్లో ఒక ఆడపిల్ల దుర్గ నామంతో ఉండేది. దుర్గ అన్న నామం ఉచ్చరించడం చేత అనేకమైన ఫలితాలు సంక్రమిస్తాయి. దుర్గ అన్న నామంలో 'ద' కారం చేత దైత్య అనగా రాక్షస ప్రవృత్తి నాశనమవుతుంది. అలా నాశనం అయిన కారణం చేత మనసులో సమాజాన్ని పాడుచేసి వక్రగతిలోకి తీసుకుని వెళ్ళాలనే ప్రబోధాలు ఉండవు. ఎందుచేత అంటే మిగిలిన యుగాలకు కలియుగానికి ఒక భేదం ఉంటుంది. మిగిలిన యుగాలలో రాక్షసులకు వేరు ఉపాధి ఉన్నది. వాళ్ళు రాక్షసులు అని గుర్తు పట్టవచ్చు. కలియుగంలో రాక్షసులకు వేరు ఉపాధి లేదు. చూడగానే రాక్షసుడు అని చెప్పడానికి ఉండదు.

మరి రాక్షసుడు ఎక్కడ ఉంటాడు? అంటే నరుడి హృదయంలోనే ఉంటాడు. రాక్షసులు మనసులలోనే ఉంటారు. 'దుర్గా' అని ఒక్కసారి ఉచ్చరిస్తే మనలోనే